# విధివశం

శ్రీ ఆరాధ్యుల

చరచరా నడుస్తూ, సురసురలాడుతూ యింట్లోకి వస్తున్న నీలకంఠంగారి కోటు విప్పబోయింది శ్రీమతి. అంతలోనే 'హూ' అంటూ బుసకొట్టి విదిలించాడు.

"ఏమిటండీ యింతకోపకగా ఉన్నారు?" అంది శ్రీమతి.

"హు కోపం! ఇంతకీ నీవు కదా చెడగొట్టింది వాణ్ణి. కోప్పడుతున్నప్పుడల్లా ప్రతిదానికి నీవు వాడిని వెనక వేసుకొచ్చావ్. నీ అలుసు తీసుకొనేగా వాడు ఆడింది ఆట పాడింది పాట అయింది."

"ఎవరండీ యింతకీ?"

"ఎవరా! నీ సు..సు. పు...త్రు...డు."

"ఏమి చేశాడు? ప్రతిదానికి వాడిమీద విసురుకు పడతారు."

"అలా అనీ కాదు వాణ్ని యీదారికి తీసుకొచ్చింది."

"ఇంతకీ ఏమి చేశాడండీ?'!

ఏమిచేశాడా? హు! ఏదైనా చేస్తాడు. ప్రే... మ...ట! ప్రే..మ...! వయసొచ్చిన ప్రతివాడికి యిదొక ఊత పదమైంది. ఓ అమ్మాయిని ప్రేమించాడట. ఇదేనా వీడు కాలేజీలో చదివే చదువు. ప్రేయసితో సరససల్లాపాలు చేయటానికేనా సంవత్సరానికి వెయ్యిరూపాయలు దగ్గం చేస్తున్నాడు. ఇదేనా వీడి చదువు యొక్క ఫలితం. మనవాడు పెద్దచదువరి యని విర్రవీగావే, చూడు నీ సుపుత్రుని చదువు" అంటూ చేతిలోని ఉత్తరాన్ని శ్రీమతిముందు గిరాటు వేశాడు కోపంతో.

ఆతని మాటలు ఆమెను చిరాకు కలిగించాయ్. క్రిందపడిన ఉత్తరాన్ని ఆమె చదువ నారంభించింది.

"ప్రియ వసూ!

ఇచట ప్రతిక్షణము ఒక యుగంగా ఉంది. మన జీవితాలు అంధకార బంధుర మవుతుందనుకున్నాను. కాని మన పెళ్ళికి శుభ కాంక్ష తెల్పింది మా అమ్మ. ఇక నీదే ఆలస్యం. నీవు పంపే శుభ వార్తకు అర్రులు చాస్తున్నది నా మనస్సు. మన ప్రేమలు నీటి బుడగలు కావని విశ్వసిస్తున్నాను, మీ వాగ్దాన నిర్వహణలో నిమగ్నులవుతారని ఆశిస్తున్నాను.

ఇట్లు
నీ సుజాత."

అంతా చదివిన తర్వాత నిర్ఘాంత పోయింది. ఆమె మనస్సు వ్యాకులత చెందింది.

"ఆ!.. ఇంతకీ మనవాడే నంటారా!" అంది శ్రీమతి.

"అనేందేంటి. చదివావుగా. వాడింత భ్రష్టుడవటానికి కారణం నీవు. వాడు లక్షాధికారి అవుతాడని ఆశించాను. ఆ అమ్మాయి నిక్షేపంలాంటి పిల్ల. నేనింత ఉచ్ఛస్థితికి రావటానికి వాళ్ళ నాన్నే కారణం. చనిపోయేటప్పుడు నా చేతిలో

చేయివేసి వాళ్ళ అమ్మాయిని మన వాసుకి పెళ్ళిచేసుకోమని, అదే తన తుదికోర్కె యని చెప్పి ప్రాణం వదిలాడు. ఆమెనాన్న వకీలుగాచేసి లక్షలు గడించాడు ..''

''ఆ....ఇప్పుడు మాత్రమేమైంది. వాడు కాదన్నాడా? ఈ ఆడపిల్లల ధోరణే అంత. మగవాళ్ళు కాస్త ఊసుపోక నాల్గు మాటలు మాట్లాడితే చాలు, కలానికి పని కల్పిస్తారు.

''ఇంకా వాడిని నమ్ముతున్నావన్న మాట. రానీ వాడిని ఏమిచేస్తానో చూడు. ఈ నీలకంఠానికి కోపం రానేరాదు. వచ్చిందా, హుం...నీకు తెలుసుగా.''

''వాడినేమనకండి. వాడు ఒక్కగా నొక్క కొడుకు. వాడికోసమేగా యీ సకలసంపదలు. వాడి సంతోషానికేగా మీరింత డబ్బు గడించింది. వాడు మన కంటి ఎదుట లేకపోతే మన జీవితాలు ఎలా ఉంటాయో ఊహించారా? వాడు సుహృదయుడు. నయాన చెప్పి చూడండి.''

అంతలో బ్యాటు త్రిప్పుకుంటూ నవ్వుతూ క్లబ్ నుంచి వస్తున్న వాసును చూచారు నీలకంఠంగారు. నాన్నగారి ముఖకవళికను చూడగానే భయమేసింది వాసుకి.

''ఏరా వాసూ? ఇటురా'' అని పిలిచాడు.

''ఏంటి నాన్నా!'' అన్నాడు వణుకుతున్న పెదవులతో వాసు.

''హుం!!! నా.. న్న ..నీవే నన్ను నాన్నగా భావించేటట్లయితే నా మాటను నెరవేర్చు. లేకపోతే ...''

''ఎప్పుడు కాదన్నాను నాన్నా నీ మాటను.''

''సరే. చెబుతున్నా విను. నీవు సు...జా . తను మఱచిపో. నేను చెప్పిన అమ్మాయిని పెళ్ళిచేసుకో. లక్షలు వస్తాయిరా లక్షలు! ఇటు డబ్బు వస్తుంది. అటు నా మాటా దక్కుతుంది. హుం... ఆలోచించుకో.''

''అది నావల్లకాదు నాన్నా! సుజాత తను మనసారా ప్రేమించాను. నామీద చాల ఆశపెట్టుకుంది. ఊహాప్రపంచంలో మేడలు కట్టింది. నావలన తన జీవితాన్ని ధన్యం చేసికోవాలని పలుసార్లు నన్ను కోరింది. నా హృదయంలో ఆసనాన్ని నిర్మించుకుంది. అట్టి నా సుజాతను మఱచిపోవటం యీ జన్మకు లేదు నాన్నా!''

''సరే! ఆఖరుసారిగా చెబుతున్నా. నామాట విన్నావా, తండ్రికొడుకుల సంబంధం చిరస్థాయిగా నిల్చిఉంటుంది. లేదా, నేను తండ్రిని కాను నీవు కొడుకువు కావు. ఆలోచించుకో'' అంటూ కోపంగా శ్రీమతి వారించినా ఆగక డ్రైవరును పిలిచి టాక్సీలో తన స్వీట్సు కంపెనీకి వెళ్లాడు.

ఆటాక్సీ కంపెనీ ఆవరణలో ఆఫీసు రూమ్ ముందు ఆగింది. నీలకంఠంగారు టాక్సీ దిగి ఆఫీసు రూములోగుండా తన రూమ్‌లోకి వెళ్ళాడు. దానిలో మూడు కుర్చీలు ఉన్నాయ్. వాటిమధ్య విలువైన సిల్కుగుడ్డ పర్చబడి ఒక డ్రాయరు ఉంది. ప్రక్కన ఒక బీరువా ఉంది. డ్రాయరు పైన ఫోను అమర్చబడి ఉంది. నీలకంఠం గారి చూపులు ఒక్కసారిగా ఆ ఫోనుపై

ప్రసరింపసాగినవి. వెంటనే రిసీవర్‌ను చెవ్వు దగ్గఱపెట్టుకొని మాట్లాడసాగారు.

"హాల్లో! పంకజమ్మగారూ!

..........................

"ఎవరు మీరు?"

..........................

"ఆ! సుజాతా!"

..........................

"పంకజమ్మగారికి నువ్వేమవుతావ్?"

..........................

"ఆ! పంకజమ్మగారి కూతురువా! నీవేమి చేస్తుంటావ్"

..........................

"బి. ఎ. చదువుతున్నావా! అయితే వాసు అనే అబ్బాయిని ఎరుగుదువా?

..........................

"అయితే, వాసుకి ఉత్తరం వ్రాసింది నీవేనా?

..........................

"ఏం ఊరుకున్నావ్? చెప్పమ్మా ఫర్వాలేదు."

..........................

"అవునా! ఆ...అయితే నువ్వే పంకజమ్మగారి కూతురువన్నమాట. ఉత్తరం వ్రాసింది నీవా! సరే. అయితే నేను మీ నాన్నగారి ముఖ్యస్నేహితుణ్ణి. నన్ను కుడిభుజంగా వారు తలంచేవారు. నిన్ను చూచి చాలా కాలమైంది. నీవు నన్ను ఆట్టే ఎరుగవు. కాని మీ అమ్మకు బాగా తెలుసు. మీతో మాట్లాడవలసిన పనుంది. కావున మీ అమ్మగారికి నా మాటలుగా చెప్పి తక్షణం మీరిద్దరూ బయలుదేరి మా యింటికి రండి" అంటూ ఫోనును ముగించాడు.

"నీలకంఠంగారి ముఖం వికసించింది. ఆయన ఆనందానికి అవధులులేవు. కంపెనీ మేనేజరుగా తనకున్న కాస్త పనులు ముగించుకొని సాయంకాలం కారులో బయలుదేరి యింటికి వచ్చారు.

"ఏమేవ్! మా స్నేహితుని కూతురునే పెళ్ళిచేసుకోమని మన వాసుతో పోరాడితినే, ఆ అమ్మాయినేనంట మన వాసు ప్రేమించింది. ఆ అమ్మాయే నాతో మధ్యాహ్నం ఫోనులో మాట్లాడింది. అంతా 'విధివశం'. ఎవరు తప్పించుకోగలరు" అన్నారు నీలకంఠంగారు, అప్పుడే తీక్షణచూపులతో వచ్చిన శ్రీమతితో.

"అబ్బ! నా మనస్సిప్పుడు కుదుటబడింది. మీ కోపాగ్ని చూచి ఎంత తహతహలాడానని అనుకున్నారు" అని అంటుండగానే పంకజమ్మ సుజాత లిద్దరూ వచ్చారు.

"నమస్కారమమ్మా పంకజమ్మగారూ" అన్నారు నీలకంఠంగారు సంతసవదనంతో.

"నమస్కారమండీ! నమస్కారమమ్మా!" అని యిద్దరకూ నమస్కరించింది పంకజమ్మ సవినయంగా.

"రామ్మా సుజాతా! కూర్చోమ్మా!" అంటూ చేతిని లాగి కూర్చోబెట్టింది కుర్చీలో శ్రీమతి.

ఇంతలోనే, వాసు యీసారి బిక్కమొగముతో దిక్కులు చూచుకుంటూ

వస్తున్నాడు తండ్రి ఉంటాడన్న విషయము వూహించి. ఒక్కసారిగా తన ప్రేయసి, సుజాతను చూచి సంతోషసముద్రంలో మునిగిన వాసు "హల్లో" అని, తండ్రిని చూడగనే నాలుక కొరుక్కున్నాడు. కాని తండ్రిగారి ముఖంలో సంతోషం తాండవిస్తోంది. తనకోరిక ఫలించదేమో, తన ప్రేయసిని స్వీకరించటానికి తల్లిదండ్రుల యెడబాటును భరించవలసి వస్తుందేమో నని సతమతమవుతున్న వాసు, పరిస్థితులిట్లు అనుకూలంగా ఉంటాయని తాను యిప్పటివరకు ఊహించలేదు. ఇదంతా 'విధివశం', 'బ్రహ్మవ్రాత' అని తలంచి లోలోన సంతసించాడు.

"అరే వాసూ! యీమేనా నీ ప్రేయసి?" అని అడిగాడు తండ్రి సంతోషంతో.

అవును అన్నట్టు తలవూపాడు వాసు.

"అయితే, పంకజమ్మా! సుజాత, వాసులు ప్రేమించుకున్నారట. మన మాటలు లేకుండానే వాళ్ళ పని వాళ్ళు నిర్వర్తించుకున్నారు. ఇక మనం వున్నాముగా అక్షింతలు వేయటానికి. పురోహితుని పిలుద్దామా లగ్నం పెట్టేందుకు? ఇంకా ఆలస్యం ఎందుకూ! 'సుభస్య శీఘ్రం' అన్నారు పెద్దలు" అని అన్నాడు సంతోషస్వరంతో.

పంకజమ్మ సుజాతవంక చూసింది. సుజాత సిగ్గుతో తలవంచుకుంది అంగీకార సూచకంగా. "సరే. మీకంతా యిష్టమయితే నాదేముంది" అంది పంకజమ్మ.

"అబ్బ! నా స్నేహితుని ఆత్మశాంతి 'విధివశం'వల్ల యీనాడు చేకూరింది. అంతేచాలు" అంటూ టాక్సీ డ్రైవరును పురోహితుని కొఱకు పంపాడు. ఇల్లంతా నవ్వులతో కళకళలాడింది.

పాత్రుడు గారి

బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354

కుంభకోణము బ్రాంచి: 7. సారంగపాణి కోవిల తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.